శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్



మైలార్‌దేవ్‌పల్లి: రామకృష్ణ మఠాన్ని స్థాపించి 125 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా విద్యార్థులకు స్వామి వివేకనంద స్ఫూర్తితో టాలెంట్ టెస్టును శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రనగర్ సర్కిల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ సేవా సమితి నిర్వాహకులు బొల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. వివేకనంద టాలెంట్ టెస్టును రాజేంద్రనగర్‌లోని 25 పాఠశాలలో మొత్తం 2000 మంది విద్యార్థులతో నిర్వాహించామని అన్నారు. ఈ టాలెంట్ టెస్టులో పాల్గొన్న విద్యార్థులకు జనవరి 12వ తేదీన స్వామి వివేకానంద జన్మదినాన్ని పురస్కరించుకొని ఉత్తీర్ణులైన విద్యార్థులకు ముఖ్య అతిథులతో ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉద్యానవనంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమావేశంలో భాగంగా పాల్గొన్న విద్యార్థులు

ఏజీవర్సిటీ: శ్రీ కొండ లక్ష్మణ్ ఉద్యానవన విశ్వవిద్యాలయంలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులు అందరు కలిసి తమ యోగ క్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం ఉద్యానశాఖలో ఉద్యాన విస్తరణ, యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాల గురించి చర్చించారు. నియమకాలు జరగాలంటే ఏం చేయాలి ఎలా ముందుకు వెళ్ళాలి మన భవిష్యత్తు ఎంటి అనే విషయాలపై ప్రతి ఒక్కరి ఆలోచనలను అభిప్రాయాలను తీసుకున్నారు. గత 20 సంవత్సరాలుగా ఉద్యానవణ శాఖలోల ఎలాంటి నియమకాలు లేవని ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని ఇందుకు ప్రణాళిక పరంగా వెళ్లటానికి ఓ కమిటిని ఏర్పాటు చేసుకున్నారన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



కిక్ బాక్సింగ్ విజేతను అభినందిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఖేలో ఇండియా తెలంగాణ ఓపెన్ బాక్సింగ్ చాంపియన్ షిప్ 2023 నిర్వహించిన పోటీల్లో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌కు చెందిన తరుణ్ సంక్ల రెండు గోల్డ్ మెడల్‌లను సాధించారు. శనివారం కార్పొరేటర్ నివాసంలో క్రీడారుడిని సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..ప్రతి ఒక్కరికి క్రీడలలో, చదువులలో క్రమ శిక్షణ, పట్టుదల ఉంటే సాధించలేనిది ప్రపంచంలో ఏది లేదని అన్నారు. క్రీడాకారులకు ఎల్లప్పుడు తన సహాయసహాకారాలు ఉంటాయని తెలిపారు. యువతకు స్ఫూర్తిదాయకంగా ఉన్న కోచ్ నిఖేష్‌రెడ్డిని ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, తలారి చిన్న, చందు నాయక్, శీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో 5 కే, 10కే రన్



శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో 5 కే, 10కే రన్ ఔత్సాహికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు జీఎంఆర్ ఎయిర్‌పోర్టు సౌత్ చీఫ్ ఇన్నోవేషన్ అధికారి ఎస్‌జీకే కిశోర్ మూడో ఎడిషన్ 5కే, 10కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా గాయకుడు శ్రీరామ్‌చంద్ర గీతాలు శ్రోతలను ఆకట్టుకున్నాయి.

ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు ఆహ్వానం

చార్మినార్: చార్మినార్ చౌక్ మైదాన్‌లోని బాలాజీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 23న అత్యంత వైభవంగా నిర్వహించే ముక్కోటి ఏకాదశి మహోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ.. దక్షిణ మండలం డీసీపీ పోతురాజు సాయిచైతన్యకు దేవాలయ ప్రధాన పూజారి శ్రుంగారం రమనాచార్యులు ఆహ్వానపత్రం అందజేశారు. ఈనెల 23 నుంచి జనవరి 16వ తేదీ వరకు ఉత్సవాలు జరుగనున్న విషయాన్ని ఆయనకి వివరించారు. ప్యారసాని వెంకటేష్, శ్రీనివాస్ బన్సల్ తదితరులున్నారు.

ఎన్నికలు ముగిసినా తొలగించని సైన్‌బోర్డులు

చార్మినార్: 2023 ఎన్నికల ప్రక్రియ ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ కొంతమంది అధికారులు తమ కార్యాలయ రూపురేఖలను మార్చడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పుడున్న సైన్‌బోర్డులనే ఇంకా కొనసాగిస్తూ.. విధి నిర్వహణ జరుగుతోంది. చార్మినార్ సర్కిల్–9 డిప్యూటీ కమిషనర్ కార్యాలయం భవనంలో చార్మినార్ ఆర్వో బోర్డులు ఇంకా అలాగే ఉన్నాయి. దీంతో వివిధ పనుల కోసం కార్యాలయానికి వస్తున్న ఫిర్యాదుదారులు అయోమయానికి గురౌతున్నారు. మొఘల్‌పురాలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ భవన సముదాయంలో సర్కిల్–9 డీసీ కార్యాలయం కొనసాగుతోంది. 2023 ఎన్నికలను పురస్కరించుకుని చార్మినార్ రిటర్నింగ్ అధికారి, జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ ఆర్వో కార్యాలయాన్ని మొఘల్‌పురా స్పోర్ట్స్ కార్యాలయంలో ఏర్పాటు చేయించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే ఆయన తన రోజువారి కార్యకలాపాలను ఎప్పటిలాగే పూల్‌బాగ్‌లోని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ కార్యాలయం నుంచి కొనసాగిస్తున్నారు. సైన్‌బోర్డులను తొలగించకపోవడంతో సందర్శకులు అయోమయానికి గురౌతున్నారు.

కార్వాన్ సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తుతా !



ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన అసెంబ్లీ సమావేశాలకు బయలుదేరే ముందు హాకీంపేట్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని అడుగుతామని, రేవంత్‌రెడ్డి మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి జరిగిన సమావేశానికి తనను కూడా ఆహ్వానించారన్నారు. మూసీ నదితో కార్వాన్ నియోజకవర్గానికి ఎంతో సంబంధం ఉందని కార్వాన్ మీదుగా ఈ నది ప్రవహిస్తుందన్నారు. మూసీ గట్టున ఆధునిక దోభీఘాట్‌లను నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. కబ్జాకు గురైన స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వాన్ని వివరిస్తామన్నారు. లంగర్‌హౌజ్, కార్వాన్, జియాగూడ తదితర ప్రాంతాల్లో మూసీ పరివాహక ప్రాంతంలో పార్కులు, గ్రీన్‌షెల్టర్లు అభివృద్ధి చేసేందుకు సంబంధిత మంత్రిని కోరుతామన్నారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోండి



హనుమాన్‌నగర్‌లోని ఖాళీ స్థలంలో రాత్రికి రాత్రే వెలిసిన అక్రమ నిర్మాణాలు



కమిషనర్ శరత్‌చంద్రకు ఫిర్యాదు చేస్తున్న అపార్ట్‌మెంట్ వాసులు

రాజేంద్రనగర్: ప్రభుత్వ స్థలంలో రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపడుతున్నా... రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని హనుమాన్‌నగర్ వాసులు ఆరోపిస్తున్నారు. రాజేంద్రనగర్ డివిజన్ హనుమాన్‌నగర్‌లోని సర్వే నంబర్ 320, 321లో ఐదు దశాబ్దాలుగా నిరుపేదలు ఇళ్లు నిర్మించుకొని నివసిస్తున్నారు. ఈ స్థలం ప్రభుత్వానికి సంబంధించింది కావడంతో వివాదం నడుస్తుంది. ఇక్కడి ఖాళీ స్థలంలో గత వారం రోజులుగా కొందరు రాత్రి సమయంలో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు వెల్లడిస్తున్నారు. రాత్రికి రాత్రి చుట్టు ప్రహరీ నిర్మించి సున్నాలు వేస్తున్నారని వెల్లడిస్తున్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా... పట్టించుకోవడం లేదని తెలుపుతున్నారు. రాజేంద్రనగర్ డివిజన్ ఆర్డీఓ, తహసీల్దార్‌లు ఈ విషయంలో స్పందించి అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని విన్నవిస్తున్నారు. తాము మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు నిర్మాణాలు చేపడుతుంటే అడ్డుకుంటున్న రెవెన్యూ అధికారులు ఈ అక్రమ నిర్మాణాలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

బండ్లగూడ: అక్రమంగా చేపడుతున్న నిర్మాణ పనులను వెంటనే అడ్డుకోని వారిపై చర్యలు తీసుకోవాలని యూనిటి వెల్ఫేర్ అసోసియేషన్ జైయిన్స్ సల్బర్గ్ అపార్ట్‌మెంట్ వాసులు కోరారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమంగా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని శనివారం జిల్లా కలెక్టర్‌తో పాటు కార్పొరేషన్ కమీషనర్ శరత్‌చంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడతూ అపార్ట్‌మెంట్ ప్రాంతంలో ఎక్స టర్నల్స్ లిఫ్టు, పెంట్ హౌజ్ రూమ్ తదితర వాటిని అక్రమంగా నిర్మిస్తున్నారన్నారు. ఈ విషయమై సదరు వ్యక్తి అనుమతులు లేకుండా నిర్మాణాలు ఎలా నిర్మాణాలు చేపడతారని ప్రశ్నిస్తే బెదిరింపులు, దాడులకు దిగుతున్నారన్నారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోని కోరారు.

గంధంగూడలో పర్యటించిన జలమండలి అధికారులు



పర్యటిస్తున్న జలమండలి అధికారి రవీందర్‌రెడ్డి, కార్పొరేటర్ తలారీ చంద్రశేఖర్ తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్‌లో జమండలి జీఎం రవీందర్‌రెడ్డి శనివారం పర్యటించారు. సాక్షి దిన పత్రికలో ప్రచురించిన కథనానికి స్పందించిన జల మండలి అధికారులు కదలి వచ్చారు. కార్పొరేషన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ కాలనీ, విద్యానగర్ ఫేస్–2 పరిసర కాలనీలలో నీటి సమస్య ఉందని శుక్రవారం కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు జలమండలి జీఎం రవీందర్‌రెడ్డి అధికారులతో పర్యటించి నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైరాగిగూడలో 10 లక్షల కేఎల్ మంచినీటి రిజర్వాయర్, గంధంగూడ వెంకటేశ్వర స్వామి ఆలయం పక్కన 20 లక్షల కేఎల్ మంచినీటి రిజర్వాయర్లను నిర్మిస్తున్నామన్నారు. ఈ పనులు చివర దశలో ఉన్నాయని త్వరలో పూర్తి చేసి నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తలారీ చంద్రశేఖర్, మేనేజర్ రాజనరేందర్, ఎల్లమయ్య, రాములు, తలారీ ప్రేమ్‌కుమార్, నరేందర్, కృష్ణ, సాగర్, రాములు, సుదర్శన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను గ్రామాలకు విస్తరించాలి



ఎన్ఐఆర్‌డీలో తక్కువ ఖర్చుతో నిర్మించిన గృహాలను పరిశీలించిన విద్యార్థులు

మణికొండ: సమాజంలో పెరుగుతున్న సాంకేతికతను గ్రామాలకు చేర్చి ప్రజలందరికీ సౌకర్యాలను కల్పించి వినియోగించినపుడే దానికి సార్ధకతతో పాటు పలువురికి ఉపాధి కలుగుతుందని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాల ప్రొఫెసర్ కె. జగన్నాథరావు అన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణ వికాస్, పంచాయతీ రాజ్ సంస్థ (ఎన్ఐఆర్‌డీ)ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామీణ టెక్నాలజీ పార్కు, పర్యావరణ అనుకూల సాంకేతికత, స్థానిక వనరుల ఆధారితతో తక్కువ ఖర్చుతో తయారు చేసిన గృహాలు, బయో టాయిలెట్లు, నీటి శుద్ధి, సౌరశక్తి, బయోగ్యాస్ ప్లాంట్, గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు సాంకేతికత అనేది లాభదాయకమైన ఉపాధిని, విలువ ఆధారిత ఉత్పత్తులను సృష్టించడానికి, రీసైక్లింగ్ చేయటం, నివాస యోగ్యమైన గృహాలు, తాగునీరు, పారిశుద్ధ్యంకు ఉపయోగపడాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మహేశ్వర్‌రెడ్డి, డాక్టర్ శ్రీకాంత్, విశ్వనాథ్ గోపిశెట్టి, విష్ణులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

వస్తువుల నాణ్యతపై అవగాహన సదస్సు



విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేస్తున్న దృశ్యం

శంషాబాద్ రూరల్: మార్కెట్‌లో లభించే వస్తువుల నాణ్యతను గుర్తించేలా బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలోని పెద్దగోల్కొండలోని శ్రీ జ్ఞాన సరస్వతి విద్యా మందిర్ పాఠశాలలో శనివారం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. విద్యతో పాటు సమాజంలో జరిగే వివిధ అంశాలు ముఖ్యంగా మార్కెట్ విషయాలపై విద్యార్థులకు అవగాహన తప్పనిసరి అని పాఠశాల కరస్పాండెంట్ పి.నిరంజన్ అన్నారు. ఇలాంటి సదస్సులు విద్యార్థులకు ఉపయోగపడతాయని తెలిపారు. ఐఎస్ఐ ట్రేడ్ మార్కు ఉన్న వస్తువులు, మిగతా వాటికి ఉన్న తేడాలను ఎలా గుర్తించాలో బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్స్ రీసోర్స్ పర్సన్ జి.ప్రభాకర్ తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పి.రవీందర్, వైస్ ప్రిన్సిపల్ పి.దేవందర్, బిస్ ప్రతినిధులు అభిసాయి, జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలోనే సరైన పునాది వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ సుశీందర్‌రావు

రంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి సుశీందర్‌రావు

రాయదుర్గం: విద్యార్థుల సమగ్ర వికాసానికి ప్రభుత్వ పాఠశాలల్లోనే సరైన పునాదులు పడతాయని రంగారెడ్డిజిల్లా విద్యాశాఖాధికారి సుశీందర్‌రావు అన్నారు. శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో జరిగిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆయన శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల కోసం నిత్యం ఓ గంట సమయం విధిగా కేటాయించాలని ఆయన సూచించారు. పిల్లలు సరైన మార్గంలో ఉన్నారా....? లేదా...? అని తెలుసుకుంటుండాలని, ఎప్పటికప్పుడు చదువులో వారి ప్రగతిని అంచనా వేయాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరానికి నూతన పాఠశాల భవనాలన్నీ అందుబాటులోకి వస్తాయన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాజ్‌బాబు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల అవసరాలకు తగినట్లుగా మౌలిక వసతులు కల్పిస్తున్నారన్నారు. ఒకటి నుంచి అయిదవ తరగతి వరకు సాధించాల్సిన బోధనా లక్ష్యాలను విజయవంతంగా సాధించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు జాతీయ విద్యావిధానం పై వర్క్‌షాప్

బండ్లగూడ: బండ్లగూడలోని శ్రీ సరస్వతీ విద్యాపీఠంలో ఆదివారం జాతీయ విద్యా విధానం-పాఠశాల విద్యకై కార్యప్రణాళిక ఒక్క రోజు కార్యశాల (వర్క్‌షాప్) నిర్వహిస్తున్నట్లు శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత కార్యదర్శి ముక్కాల సీతారాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ డాక్టర్ బి.జగదీశ్వర్‌రావు, విద్యా భారతీ దక్షిణ మధ్య క్షేత్ర అధ్యక్షులు డాక్టర్ చామర్తి ఉమామహేశ్వరరావు, శ్రీ సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ అధ్యక్షులు డాక్టర్ తిరుపతిరావులు హాజరుకానున్నారన్నారు. వీరితో పాటు అనేక మంది విద్యావేత్తలు పాల్గొంటారన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: గగన్ పహాడ్ ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని వివిధ మరమ్మతుల కారంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ జుబేరుద్దీన్ తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని పద్మశాలిపురం, మధుబన్ కాలనీ, ఆప్కోకాలనీ, సాయికాలనీ, టీఎజీవోస్ కాలనీ, జల్‌పల్లి ఇండస్ట్రీయల్ ప్రాంతాలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

హైటెక్స్‌లో టెక్ ఎక్స్‌పో- 2023 ప్రారంభం

మాదాపూర్: విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేయడంలో టుటోరాక్ అకాడమీ ముందుంటుందని వ్యవస్థాపకుడు డాక్టర్ మల్లికార్జున్ తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో రెండురోజుల పాటు నిర్వహించనున్న 4వ ఎడిషన్ ఈటీ టెక్ఎక్స్ (ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ రిసోర్సెస్ టెక్ ఎక్స్‌పో 2023)ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాడమీ స్కూల్ అడ్వాన్స్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా కె11, కె12 తరగతులకు ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ అనుభవం అందిస్తుందన్నారు. జేఈఈ, నీట్ వంటి ప్రతిష్టాత్మకమైన పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడంపై దృష్టి సారిస్తున్నట్టు తెలిపారు.

అన్నమయ్య స్వరార్చన

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా సరస్వతి సంగీత శిక్షణాలయం విద్యార్థులు స్వరార్చనతో సందర్శకులను అలరించారు. గురువు ఎస్. సరస్వతి శిష్యబృందం అన్నమయ్య కీర్తనలు గణనాయకం, ఆదిమూలమే, తిరుమల గిరిరాయ, నారాయణ, జయలక్ష్మి , వరలక్ష్మీ, ఇతడే పరబ్రహ్మ తదితరాలు ఆలపించారు. వీరికి వయోలిన్ షణ్ముఖశర్మ, మృదంగం మల్లికార్జున శర్మ వాయిద్య సహకారం అందించారు. అనంతరం కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు.

ఆకట్టుకుంటున్న ఆలిండియా క్రాఫ్ట్ మేళా

● అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్: శిల్పారామంలో ఏర్పాటు చేసిన ఆలిండియా క్రాఫ్ట్‌మేళా సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. శనివారం సెలవురోజు కావడంతో సందర్శకుల సందడి నెలకొంది. చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేశారు. సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ తంజావూర్ స్పాన్సర్ చేసిన గారడీ గొంబే, బుట్టబొమ్మలు, సూర్యప్రకాశ్ బృందం నృత్యం, త్రిప్తి నగర్ ఉజ్జయిని కళాకారులు జానపద నృత్యంతో అలరించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా కాత్యాయిని శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు.

నేటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు



మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ మంచిరేవులలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయంలో ఆదివారం నుంచి ధనుర్మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు తెలిపారు. ఉత్సవాలలో భాగంగా ప్రతి రోజు ఉదయం 5.30గంటల నుంచి అష్టోత్తర శతనామార్చన, తిరుప్పావై సేవాకాలము, శాత్తు ముర్రై, గోదా అమ్మవారికి సారె సమర్పణలు ఉంటాయన్నారు. ఈనెల 23వ తేదీన ఉదయం 5.30గంటల నుంచి స్వామి వారి వైకుంఠ ఉత్తర ద్వార దర్శనము ఉంటుందని ఆయన పేర్కొన్నారు. జనవరి 15వ తేదీన ఉదయం 11గంటలకు శ్రీగోదా రంగనాయకుల కల్యాణము నిర్వహిస్తామని, భక్తులు ఉత్సవాలలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి ఆత్మహత్య



మహ్మద్ అస్లాం (ఫైల్)

రాజేంద్రనగర్: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..చింతల్‌మేట్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అస్లాం (30) ఆటో డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి అస్లాం బుద్వేల్ ప్రాంతంలోని తనకు పరిచయస్తురాలైన జన్నత్‌బేగం ఇంటికి వచ్చాడు. అయితే జన్నత్‌బేగం తన కుటుంబ సభ్యులతో కలిసి బయటకు వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండగా..అస్లాం తాళం పగులగొట్టి ఇంట్లోకి వెళ్లాడు. శనివారం ఉదయం జన్నత్‌బేగం ఇంటికి వచ్చి చూడగా మహ్మద్ అస్లాం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో విషయాన్ని రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని ఉస్మానియాకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న మహ్మద్ అస్లాం తల్లిదండ్రులు సంఘటన స్థలానికి చేరుకొని జన్నత్ బేగం, ఆమె కుమారులు, మరికొంత మంది కలిసి మహ్మద్ అస్లాంను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపించారు. నిందితురాలిని కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పీఎస్‌ను సందర్శించిన చిన్నారులు

గచ్చిబౌలి: హలు కిడ్స్ స్కూల్ విద్యార్థులు శనివారం గచ్చిబౌలి పీఎస్‌ను సందర్శించారు. రిసెప్షన్‌తో పాటు విజిటర్స్ ఏరియా, ఎస్‌హెచ్‌ఓ రూమ్, లాకప్‌ను చూశారు. పోలీస్‌స్టేషన్ గురించి ఉపాధ్యాయులు చిన్నారులకు వివరించారు. సాధారణ విజిటర్స్‌తో పాటు చిన్నారులు రావడంతో పీఎస్ సందడిగా మారింది.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దోహదం

సుల్తాన్‌బజార్: అనువర్తిత జంతుశాస్త్రం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడుతుందని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం .విజ్జులత అన్నారు. మహిళా విశ్వవిద్యాలయం హైదరాబాద్ చాప్టర్, జువాలజీ శాఖ, తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం విశ్వవిద్యాలయంలోని పీజీ సెమినార్ హాల్‌లో అనువర్తిత జంతుశాస్త్రంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ విజ్జులత హాజరై సెమినార్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సదస్సులు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఉపయోగపడతాయన్నారు. జీవశాస్త్రంలో వారి పురోగతిని మెరుగుపరిచేందుకు, నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఇలాంటి సదస్సులు ఎంతో అవసరమన్నారు. ఉస్మానియా మహిళా కళాశాల శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇలాంటి సెమినార్‌లు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు.

టీహబ్ స్టార్టప్ 'ఛోటు' ప్రారంభం



'ఛోటు' క్యూఆర్ కోడ్‌ను ప్రారంభిస్తున్న సీఈఓ శ్రీనివాసరావు, నిర్వాహకులు

రాయదుర్గం: వినూత్న ఆలోచనలున్న యువతను ప్రోత్సహించడమే టీహబ్ లక్ష్యంగా పనిచేస్తుందని సీఈఓ ఎం శ్రీనివాసరావు స్పష్టం చేశారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో శనివారం టీహబ్ స్టార్టప్ 'ఛోటు' క్యూఆర్ కోడ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశంలో 1.3 కోట్ల కిరాణాషాప్‌లు ఉన్నాయని, మిగతా రకాల షాపులు జతపరిస్తే, ఆ సంఖ్య భారీగా ఉంటుందన్నారు. యూపీఐతో చెల్లింపులు చాలా సులువుగా సాగుతున్నాయని, కానీ ఇంకా ఈ కామర్స్ లోకల్‌షాప్‌లు అందుబాటులోకి రాలేదన్నారు. ఛోటు ఈ వ్యత్యాసాన్ని తగ్గించగలదని భావిస్తున్నామన్నారు. 'ఛోటు' స్టార్టప్ సహ వ్యవస్థాపకుడు వై రవి మాట్లాడుతూ ఛోటు స్టార్టప్‌తో ప్రతి లోకల్‌షాప్‌ని ఆన్‌లైన్ చేయడమే తమ లక్ష్యం అని అన్నారు. మరో సహ వ్యవస్థాపకుడు వంశీ పంజాల మాట్లాడుతూ పాన్ ఇండియా సినిమాలకు హైదరాబాద్‌పుట్టినిల్లు అని, తాము ముందుగా తెలుగు రాష్ట్రాలలో దీన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో టీహబ్ చీఫ్ డిజిటల్ ఆఫీసర్ వింగ్ కమాండర్ అంథోని అనీష్, తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ శాంతతౌతం, ఛోటు స్టార్టప్ ప్రతినిధులు పాల్గొన్నారు.